# స్మార్ట్ సిటీలు ` నిధుల కొరత ` సంస్కరణలు

- **డా॥బి.గంగారావు**

- సెల్ : 9490098792

కేంద్ర బిజెపి సర్కార్ దేశంలో ఆర్భాటంగా ప్రారంభించిన స్మార్ట్ సిటీ మిషన్‌కు ఏడేళ్లు పూర్తయింది. దేశంలో ఎంపిక చేసిన 100 స్మార్ట్ సిటీ ల నిర్మాణం త్వరలో పూర్తి కాబోతున్నదని, మనం చేపట్టిన ఈ ప్రయత్నం దేశంలో పట్టణీకరణకు సరికొత్త కోణాన్ని ఇచ్చిందని, ప్రపంచమంతా మనదేశ స్మార్ట్ సిటీల గురించే మాట్లాడుకోవాల్సిన పరిస్థితిని సృష్టించామని దేశ ప్రధాని నరేంద్ర మోదీ  ఇటీవల మాట్లాడారు. 2015 జూన్ లో స్మార్ట్ సిటీ మిషన్‌ను ప్రారంభిస్తూ ఈ పథకం ద్వారా దేశ పట్టణ వ్యవస్థలో అనేక నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని,పట్టణాలు,నగరాలు నవీకరించబడి సరికొత్త జవసత్వాలు సంతరించుకొని రూపాంతరం చెందుతాయని ప్రకటించారు. ఈ మాటలన్నీ వట్టి బూటకమని గడిచిన ఏడేళ్ళ ఆచరణ తెలియజేస్తున్నది.  అసలు ఏజెండా వేరుగా ఉందనేది కూడా తెలుస్తున్నది. అంతే కాకుండా నేడు దేశంలో ఎంపిక చేసిన స్మార్ట్ సిటీలన్ని నిధులు లేక విలవిలలాడుతున్నాయి. చేపట్టిన పనులకు బిల్లులు కూడా చెల్లించలేకపోతున్నాయి. అర్ధాంతరంగా అనేక ప్రాజెక్టులు ఆగిపోయాయి. రెండోవైపు పట్టణ స్థానిక సంస్థలయొక్క అధికారాలను, హక్కులను హరించి వేస్తూ ప్రజలుపై భారాలు మోపబడుతున్నాయి.

**ప్రాజెక్టుల అమలు తీరు - `నిధుల కొరత :**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న స్మార్ట్ సిటీల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఆంధ్రప్రదేశ్ లో విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతిలను,  తెలంగాణా రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్ నగరాలను స్మార్ట్ సిటీలు గా ఎంపిక చేశారు. వీటి ఐదేళ్ల కాల పరిమితి కూడా పూర్తయింది. కానీ అత్యధిక ప్రాజెక్టులు పూర్తి కాలేదు.ఆంధ్ర లో నాలుగు స్మార్ట్ సిటీల కార్పొరేషన్లు సుమారు రూ.5670 కోట్లవిలువ గల ప్రాజెక్టులు అమలు చేయాలని నిర్ణయించుకున్నాయి. ఇప్పటివరకు రూ.2798 కోట్లు ఈ నాలుగు స్మార్ట్ సిటీల పరిధిలో ఖర్చు చేసినట్లు సమాచారం. చేసిన ఖర్చులో ఇంకా నాలుగు వందల కోట్లకు పైగా బిల్లులు పెండిరగ్‌లో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాల్సిన నిధులు సకాలంలో ఇవ్వకపోవటం వల్ల అత్యధిక పనులు మూలన పడిపోయాయి. అంతేకాక  స్మార్ట్ సిటీ క్రింద ఎన్ని వేల కోట్ల విలువగల ప్రాజెక్టులు చేపట్టినా  కేంద్రం ఇచ్చేది కేవలం ఒక్కో స్మార్ట్‌సిటీకి రూ. 500 కోట్లు మాత్రమే. అదీ ఏడాదికి రూ॥100కోట్లు చొప్పున ఇస్తుంది. మిగిలింది రాష్ట్ర ప్రభుత్వం లేదా స్మార్ట్ సిటీలు భరించు కోవాలనేది షరతు. దింతో చాలా ప్రాజెక్టులు ఆదిలోనే నిలిచిపోయాయి.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వరంగల్, కరీంనగర్ సిటీల్లో పరిస్థితి అత్యంత ధారుణంగా ఉంది. రూ2250కోట్ల విలువగల ప్రాజెక్టులను చేపట్టాయి. 2020జూన్ నాటికి ఈ ప్రాజెక్టులన్నీ పూర్తికావాలి. ఈ రెండు నగరాలకు కలిపి కేంద్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల నిధులు ఇవ్వాలి. కానీ ఇప్పటి వరకు రూ.196 కోట్ల చొప్పున నిధులు బదిలీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండిరటికీ కలిపి రూ 210 కోట్లు ఇచ్చింది. కేంద్రం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కక్షగట్టి వ్యవహరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం పై ప్రత్యక్ష దాడికి దిగింది. దీంతో రెండు నగరాల్లో స్మార్ట్ ప్రాజెక్టులు అగమ్యగోచరం లో పడ్డాయి. తెలంగాణ మీదే కాదు బిజెపి నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తున్న అన్ని రాష్ట్ర ప్రతిపక్ష ప్రభుత్వాలపై ఇదే వివక్షత చూపిస్తూ తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నది.

మొత్తం 100 స్మార్ట్ సిటీల పురోభివృద్ధి చూస్తే ఈ పథకం అమలు తీరు అర్థం చేసుకోవచ్చు. ఇటీవల లోక్ సభ కి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖా మంత్రి తెలియజేసిన వివరాల ప్రకారం వంద స్మార్ట్ సిటీ ల్లో రూ 2.05 లక్షల కోట్ల విలువ గల 5151ప్రాజెక్టులు ఆమోధించ బడ్డాయి. ఈ మొత్తం ప్రాజెక్టుల విలువలో కేంద్రప్రభుత్వం భరించేది రూ 48వేలకోట్లు అంటే 23 శాతం మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వాలు వాటాగా రూ 43 వేల కోట్లు భరిస్తాయి. మిగిలింది స్థానిక సంస్థలు అప్పులద్వారా నిధులు సమకూర్చుకోవాలి. లేని యెడల ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం(పిపిపి) లేదా పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు ప్రాజెక్ట్స్ ఇచ్చి తద్వారా పూర్తి చెయ్యాలని నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చింది రూ28413 కోట్లు అనగా తన యొక్క వాటాలో 59శాతం నిధులు విడుదల చేసింది. మొత్తం ప్రాజెక్టుల విలువలో కేంద్రం విడుదల చేసిన నిధులు చూస్తే 13 శాతం మాత్రమే. ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టుల్లో పూర్తయినవి 27.37శాతం మాత్రమే. నాలుగో వంతు ప్రాజెక్టులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. టెండర్స్ పిలిచినవి, నిర్మాణంలో వున్నవి కూడా నిధులు కొరతతో నత్తనడక లో సాగుతున్నాయి. ఈ పథకంలో చేపట్టి ప్రాజెక్టులన్నీ 2023 జూన్ లోపు పూర్తికావాలి. ఎందుకంటే ఈ పథక కాలపరిమితి అప్పటితో ముగుస్తుంది. కనుక ఏడాది కాలంలో ఎన్ని ప్రాజెక్టులు పూర్తి అవుతాయో ప్రశ్నార్థాకంగా మారింది.

స్మార్ట్ సిటీలుగా ఎంపిక అయిన నగరాలన్నీ స్మార్ట్ గా అభివృద్ధి అవుతాయనే భావన ప్రజల్లో కల్పించారు. కాని ఈ పథకం క్రింద చేపట్టే ప్రాజెక్టులు అన్ని నగర వ్యాప్తంగా చేపట్టరు.ప్రజల అవసరాలను, నగరాల మౌలిక సదుపాయాల కొరతను, మురికివాడల అభివృద్ధిం, నగర సమగ్రా భివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూపొందించినవికావు. కేంద్రప్రభుత్వం ఈ మిషన్‌లో పేర్కొన్న ప్రాజెక్టులను మత్రమే చేపట్టాలనే నిబంధన విధించారు. ఫలితంగా ఎక్కువభాగం నిధుల్లో 17శాతం పట్టణ రవాణాకి, ఐటీ కమాండ్ కంట్రోల్ కి 11శాతం, ఎనర్జీ కి 10శాతం, వ్యాపార వాణిజ్య అభివృద్ధికి 12 శాతం కేటాయించారు. ప్రజలకు ఉపయోగపడే సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ల నిర్మాణానికి 2 శాతం, మురుగునీటికాలువలకి 2 శాతం, మంచినీరు సరఫరాకు 5శాతం, సామాజిక సదుపాయాలకు 2 శాతం మాత్రమే నిధులు కేటాయింపు జరిగింది. అంతేగాక స్మార్ట్ విద్యుత్ పోల్స్, స్మార్ట్‌రోడ్లు, స్మార్ట్ ఫుట్‌పాత్‌లు,

స్మార్ట్‌స్ట్రీట్స్ , స్మార్ట్ విధ్యుత్, నీటిమీటర్లు, బ్యూటిఫికేషన్, స్మార్ట్‌డిస్‌ప్లేలు, స్మార్ట్‌సైకిల్స్, బైౖౖకులు ఇలా అనేక పేర్లతో వేలకోట్లు దుర్వినియోగం చేస్తున్నారు.

చేపడుతున్న ఈప్రాజెక్టులు కూడా నగర వ్యాపితంగా అమలు చేయడం లేదు. కేవలం నగరంలో కొద్ది భాగాన్ని స్మార్ట్‌సిటీ ప్రాంతంగా ఎంపిక చేసి 80నుండి 90శాతం నిధులు ఆ ప్రాంతంలోనే ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో బాగా అభివృద్ధి చెంది, మౌలిక సదుపాయాలు ఉన్నతంగా ఉండి, ధనివర్గ ప్రజలు నివసించే ప్రాంతాలను ఎంపిక చేసారు. మొత్తం 100 స్మార్ట్ సిటీల్లో 59 స్మార్ట్‌సిటీలను పరిశీలిస్తే 80శాతంపైబడి ప్రాజెక్టులు అనగా లక్షా5వేల కోట్ల రూపాయలు కేవలం 246 చ॥కిమీల వైశాల్యం అనగా మొత్తం వైశాల్యంలో 2.7శాతంలో గల ప్రాంతంలో ఖర్చు చేస్తున్నారు.

విశాఖపట్నంను పరిశీలిస్తే స్మార్ట్‌సిటీ ఎలా నిర్మాణం అవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. మొత్తం జనాభా 20లక్షలు. నగర విస్తీర్ణం 531 చ॥కిమీలు. మొత్తం 1620కోట్ల విలువగల ప్రాజెక్టులు స్మార్ట్‌సిటీలో భాగంగా చేపట్టారు. కేవలం 0.6శాతం వైశాల్యం గల ప్రాంతాన్ని స్మార్ట్‌సిటీగా ఎంపిక చేశారు. ఈ ప్రాంతంలో 60వేల మంది మాత్రమే నివసిస్తున్నారు. ఇది ఉన్నత మద్యతరగతి నివాసప్రాంతం. అన్ని మౌలికసదుపాయాలు ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతంలో సుమారు 1200కోట్లు ఖర్చు చేస్తున్నారు.100స్మార్ట్ సిటీలోను ఇదే పరిస్థితి.

**లిమిటెడ్ కంపెనీలు, `స్థానిక సంస్థలపై వేటు :**

స్మార్ట్‌సిటీల్లో నిధులు లేదా ప్రాజెక్టుల నిర్వాహణ, ఇతర కార్యకలాపాలన్నీ ప్రత్యేకసంస్థ ద్వారా జరుగుతుంది. 2013 కంపెనీ చట్టం క్రింద స్మార్ట్‌సిటీ లిమిటెడ్ కంపెనీలుగాప్రత్యేకంగా స్మార్ట్‌సిటీలను రిజిస్టర్ చేసారు. దీనినిర్వాహణకు ప్రత్యేక లక్ష్య సంస్థ (స్పెషల్ పర్పస్ వెహికిల్`ఎస్‌పివి)ను ఏర్పాటు చేశారు. పనులన్నీ ఈ సంస్థే నిర్వహిస్తుంది. ఈలిమిటెడ్ కంపెనీల్లో 40శాతం వరకు భాగస్వామ్యాన్ని ప్రైవేట్ సంస్థలకి కల్పిస్తున్నారు. ఎస్‌పివి సంస్థకి స్మార్ట్‌సిటీపై సర్వహక్కులు కల్పించారు. ప్రాజెక్టు కన్సల్‌టెంట్లను నియమించుకునే దగ్గరనుండి చెపట్టే ప్రాజెక్టులను ప్రవేటు సంస్థలకు అప్పగించటం, అస్తులను తనఖాపెట్టటం, జాతీయ, అంతర్జాతీయ సంస్థలనుండి అప్పులు సమకూర్చుకునే వరకు అన్ని అధికారాలు ఈ సంస్థకి కట్టబెట్టారు. అలాగే ఆ ప్రాంతంలో రకరకాల పన్నులు, యూజర్ చార్జీలు విధించే అధికారం కూడా ఈ సంస్థకి ఇచ్చారు. దీనితో ఇప్పటికే 21% ప్రాజెక్టులను పిపిపి క్రింద ప్రైవేట్ సంస్థలకి ఇచ్చేసారు. ఆస్థులను తనఖాపెట్టి సుమారు రూ॥4వేల కోట్లపైన అప్పులు తీసుకున్నాయి.

స్మార్ట్‌సిటీ లిమిటెడ్ కంపెనీకి స్థానిక మున్సిపల్ సంస్థకి ఎటువంటి సంబంధం లేకుండా చేసారు. నిధులు, ప్రాజెక్టులపై ఎటువంటి నియంత్రణాధికారం నగర పాలకసంస్థలకి ఉండదు. ఎన్నికైన మేయర్లు, ఛైర్మన్‌లు,

కార్పొరేటర్లు, కౌన్సిలర్స్‌లకు కూడా ఈ లిమిటెడ్ కంపెనీపై ఎలాంటి అధికారం లేదు. దీనిలో కనీసం భాగస్వాములు కూడకాదు. కౌన్సిల్స్‌ను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసి స్థానిక సంస్థల అధికారాలను నిర్వీర్యం చేస్తున్నారు.

**ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం, `ప్రజల పై భారాలు :**

గత రెండు దశాబ్దాల నుంచి పట్టణ రంగంలో ప్రైవేట్ పెట్టుబడికి అనుకూలంగా అనేక మార్పులు తీసుకురావటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో వున్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యూవల్ మిషన్ (జెఎన్ఎన్ఆర్‌యుఎం) పథకాన్ని తీసుకువచ్చి 63నగరాల్లో అమలు చేసారు. ఈ పథకంలో భాగంగా పట్టణ భూగర్భిపరిమితిని రద్దు చేసారు. స్టాంప్ డ్యూటీలను తగ్గించారు. ప్రణాళిక సంఘం యొక్క నిధులను సంస్కరణలతో ముడిపెట్టారు. కేంద్ర ఇచ్చే గ్రాంట్‌లను కూడా అనేక షరతులకు ముడిపెట్టి ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టారు. కేంద్రంలో బిజెపి అధికారంలోనికి వచ్చిన తరువాత ఈ సంస్కరణలను మరింత తీవ్రతరం చేయుటకు స్మార్ట్‌సిటీ పథకాన్ని ప్రవేశపెట్టింది. పట్టణ వ్యవస్థలో ప్రైవేట్ పెట్టుబడి విచ్చలవిడి కార్యకలాపాలను నియత్రించేందుకు వున్న అనేక చట్టాలను, నిబంధలను మార్చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రణాళికను, జోనింగ్ విధానాలను పెట్టుబడిదారులకు అనుగుణంగా మార్చేస్తున్నారు. మౌలిక సదుపాయాల రంగాలను, పౌర సేవలను, ఉమ్మడిఆస్థులను మున్సిపల్ సంస్థల బాధ్యత నుండి ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తున్నారు. మున్సిపల్ సంస్థలో అయ్యే ఖర్చును పూర్తిగా ప్రజల నుండే రాబట్టలనే విధానాన్ని అమలకు పూనుకున్నారు. అందులో భాగంగా రకరకాల పన్నులు పెంచడం, కొత్తపన్నులు, యూజర్ చార్జీలు విధించడం లాంటి చర్యలు మనం చూస్తున్నాం. స్థానిక సంస్థల సుపరిపాలనను ద్వంసం చేస్తూ పట్టణ వ్యవస్థపై ప్రైవేట్ పెట్టుబడి అధిపత్యాన్ని పెంచుతున్నారు.